
# ముగ్గురు అక్కలు

-నిశాపతి



వెంకటేశ్వరరావు ఒక సన్నకారు రైతు. అతని కొడుకు వంశీ ఎంసెట్ పరీక్ష రాసి మంచి ర్యాంకుతో నెగ్గాడు. ఎంత తక్కువ ఫీజైనా అన్ని ఖర్చులూ కలిపి ఓ ముప్ఫై వేలన్నా చేతిలో ఉంటే గానీ అతను కాలేజీలో చేరలేడు. ఆ సంవత్సరం పంటలు బాగా పండక వాళ్ల నాన్నచేతిలో డబ్బులు ఆడడం లేదు.

వంశీకి ముగ్గురు అక్కలు. ముగ్గుర్నీ ఒకే ఊరు ఇచ్చారు దగ్గర్లోనే. వాళ్లవీ అంతంత మాత్రపు సంసారాలే. వెంకటేశ్వరరావుకి ఓ ఆలోచన వచ్చింది.

తన ముగ్గురు కూతుళ్లనీ ఒక్కోళ్లని పదేసి వేలు అప్పడిగితే వచ్చే సంవత్సరం పంటలో తీర్చొచ్చు. పదివేలే గనక బహుశా వాళ్లకీ పెద్ద బరువు కాకపోవచ్చు. ఈ ఆలోచన రాగానే వెంకటేశ్వరరావు వంశీని వాళ్ల అక్కల దగ్గరికి వెళ్లి తలా ఓ పదివేలు అప్పు అడిగి పట్టుకురమ్మని పంపాడు.

వంశీ బయలుదేరాడు.

★ ★ ★

ముందు పెద్దక్క దగ్గరికి వెళ్లాడు.

పెద్దక్క సంతోషంతో వంశీని ఆహ్వానించి కాళ్లకి నీళ్లిచ్చి తాగడానికి ఫ్రిజ్‌లో నీళ్ళిచ్చింది.

వంశీ తను వచ్చిన పని చెప్పాడు.

"అయ్యో నాయనా! సమయానికి నా చేతిలో డబ్బు లేకపోయెగదరా! నాన్న అడక్క అడక్క అడిగారు ఏమనుకుంటారో! నిన్ననే ఉన్న డబ్బంతా మీ బావగారు ఏదో లోను కింద జమకట్టేశారు. కాస్త ముందు తెలిస్తే వాళ్లకి ఏదో సర్దిచెప్పి ఆ డబ్బు నీకే సర్దేదాన్ని. అయ్యో! ఎంతపనయింది?!" అన్నది.

"అయితే ఏమీ లాభం లేదంటావా?" అన్నాడు వంశీ దిగాలుపడి.

"లేదు నాయనా! నేనెంత బాధపడుతున్నానో నీకు తెలీదు. నాన్నకి ఈ మాటే చెప్పు" అంది.

★ ★ ★

వంశీ కాళ్ళీడ్చుకుంటూ రెండో అక్క ఇంటికి వెళ్లాడు.

ఆమె కూడా కాళ్లకి నీళ్ళిచ్చి, బిందెలో నుంచి మంచినీళ్ళు ముంచి ఇచ్చింది.

వంశీ తను వచ్చిన పనిచెప్పాడు.

"ఏఁవిటి? ఇలా వచ్చి పీకలమీద కూర్చుని డబ్బు, డబ్బు అంటే ఇవ్వడానికి ఇక్కడేమైనా రాశులు పోసున్నాయా? మాకెన్ని కష్టాలున్నాయో నీకేం తెలుసు. ఎంత కావాలి?" అంది.

"పదివేలు" అనబోయి మళ్లీ కాస్త ఆలోచించి "పదిహేనువేలు" అన్నాడు వంశీ.

"సరే తప్పేదేముంది? పట్టుకెళ్ళు. తిండి తినకుండానే వెళ్తావా? మొహం చూడు! ఏళ్ళొస్తున్నాయి ఎందుకు? వచ్చి భోజనానికి కూచో" అంది.

భోజనం అయ్యాక వెళ్ళేటప్పుడు పదిహేను వేలు ఇచ్చి పంపింది.

★ ★ ★

వంశీ మూడో అక్క దగ్గరికి వెళ్లాడు.

ఆమె కూడా కాళ్లకి నీళ్ళిచ్చి కుండలో నుంచి మంచినీళ్ళు ముంచి ఇచ్చింది.

"అక్కా! నాకో పదిహేనువేలు కావాలి" అన్నాడు వంశీ కాస్త జంకుగా.

"సరేలేరా! చెప్పుల్లో కాళ్ళు పెట్టుకున్నట్లు ఏఁవిటా మాటలు! నాన్నగారు ఎలా ఉన్నారు? అమ్మ ఆరోగ్యం కూడా బాగుందా? నీకు ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చిందటగా! బాగా చదువుకుని పైకి రా! ఎండనబడి వచ్చావు. ఏ వేళప్పుడు తిన్నావో? లే లేచి భోజనానికి కూచో" అంది.

"లేదక్కా! చిన్నక్కా వాళ్లింట్లో భోంచేసి వస్తున్నాను" అన్నాడు వంశీ.

"అయితే కొంచెం టిఫిన్ చెయ్యి. రాత్రికి నీకిష్టమని కాకరకాయ వేపుడు చేస్తున్నా. భోంచేసి అలసట తీర్చుకుని పొద్దున్నే వెళ్దువుగాని" అంది.

'డబ్బు మాట ఎత్తదేం?' అని మనసులో అనుకుంటూ వంశీ ఆ పూటకి ఉండిపోయాడు.

మర్నాడు ఉదయం ఆమె వంశీకి డబ్బిచ్చి జాగ్రత్తలు చెప్పి పంపించింది. ఇంటికెళ్ళాక వంశీ వాళ్ల నాన్నచేతిలో డబ్బు పెట్టి నిలబడ్డాడు.

"ఎట్లా చూసుకున్నార్రా నిన్ను మీ అక్కలు" అని అడిగాడు వెంకటేశ్వరరావు.

"బాగానే చూసుకున్నారు నాన్నా! వెళ్లగానే పెద్దక్క ఫ్రిజ్‌లో నీళ్లు ఇచ్చింది. అవి చల్లగా ఉన్నాయి గాని తియ్యగా లేవు. రెండో అక్క బిందెలో నీళ్ళిచ్చింది. అవి తియ్యగా ఉన్నాయి గాని చల్లగా లేవు. మూడో అక్క కుండలో నీళ్ళు ఇచ్చింది. అవి తియ్యగానూ ఉన్నాయి, చల్లగానూ ఉన్నాయి" అన్నాడు వంశీ.

(ఎప్పుడో మూడు నాలుగు దశాబ్దాల క్రిందట చదివిన ఓ కథ ఆధారంగా-ఆ రచయితకి కృతజ్ఞతలు)

★